# ఎన్ని'కలకలం'




మిగతా దేశమంతా పట్టుకున్నట్లే ఎలక్షన్ ఫీవర్ మా కాలనీక్కూడా పట్టుకుంది.

మా కాలనీలో ప్రత్యేకత ఏంటంటే మొత్తం రెండువేల ఓట్లుంటాయ్. అదిగాక ఈ మధ్య ఓటు హక్కు కొత్తగా వచ్చిన యూత్ ఓట్లు కనీసం వెయ్యుంటాయ్.

ప్రతి ఓటుకూ కొన్ని వేల ధర పలుకుతున్న ఈ రోజుల్లో– మూడువేల ఓట్లు ఒకేచోట– ఒకే అసోసియేషన్ కింద ఉన్నాయనేసరికి ఏ పార్టీ అభ్యర్థికయినా కొంచెం టెంప్టింగ్‌గానే ఉంటుంది కదా!

అందుకని ఎలక్షన్స్ ఇంకా చాలా దూరం ఉన్నా అందరూ ఏదొక వంక కల్పించుకుని మా కాలనీకి రావటం– వాళ్ళ పార్టీకి మా వాళ్లంతా ఓటేస్తే ఏమేం ఉచితంగా ఇవ్వబోతున్నారో లిస్ట్ చదవటం చేస్తున్నారు. మా అసోసియేషన్ వాళ్ళందరం ఎమర్జెన్సీ మీటింగ్ పెట్టుకున్నాం. ఈసారి మేమందరం ఏ పార్టీకి ఓటేయాలనే విషయం మీద మా నిసార్‌మియా డిస్కషన్ ప్రారంభించాడు.

"బాగా ప్రియం అయిన సోదరిలారా! ఎక్కువ ప్రియం అయిన సోదరులారా!"

అన్నాడు ఉర్దూలో రాసుకున్న తెలుగు చదువుతూ.

"బాగా ప్రియం అయినా అంటాడేంటి! ప్రియమైన అని చదవొచ్చుగా!" అడిగాడు రంగారెడ్డి పక్కనున్న శాయిరామ్‌ని.

అంటే అయనుద్దేశ్యం ఏంటంటే అదివరకు ఓట్లు కొనుక్కోవడానికి చాలా చవగ్గా దొరికేవి! ఇప్పుడు బాగా ప్రియం అయిపోయినయ్ అని!" అంటూ ఎక్స్‌ప్లనేషనిచ్చాడు శాయిరామ్.

"కరెక్టే మరి! ఆ రోజుల్లో ఓట్లసలు ఫ్రీగా దొరికేవట! ఒక్కపైసా కూడా అడక్కుండానే ఓటేసేవారట!' అంది సావిత్రమ్మ వాళ్ళ అమ్మమ్మ చెప్పిన మాటలు గుర్తు చేసుకుంటూ.

దాంతో అందరూ ఆమె చుట్టూ మూగిపోయారు.

"నిజంగా ఒక్కపైసా కూడా తీసుకునే వారు కాదా?" అడిగారు యూత్ అసోసియేషన్ వాళ్ళు.

"అవును! యంగ్ ఏజ్‌లో ఉన్నప్పుడు నేనూ నా మొదటి ఓటు డబ్బులేమీ తీసుకోకుండానే వేశాను" అందామె గర్వంగా.

యూత్ అంతా పగలబడి నవ్వారు.

"ఏం పాగల్‌గాళ్లా భాయ్ ఆ దినాల్లో పబ్లిక్! అందుకే ఇండియా ఇంత వెనుకబడింది. వాళ్ళు చేసిన ఆ వెధవ పనివల్ల మన జనరేషనంతా సఫర్ అవుతున్నాం!" అన్నాడొకడు.

నిసార్ ఉపన్యాసం కంటిన్యూ చేశాడు.

"ఈ దినం మనమంతా టూమచ్ గర్వపడుకోవాల్సిన దినం!"

"ఆహా! ఎంత గొప్ప తెలుగురా నాయినా! గర్వాన్ని కూడా పడుకోబెట్టాశావ్" అన్నారెవరో వెనుకనుంచి.

ఆ మాట వినిపించేసరికి నిసార్‌కి కోపం వచ్చింది.

"ఇగో- నేను కొంచెం జర ఎక్కువ కష్టంపడి తెలుగూ మాట్లాడినయ్. నీకు ఒక్క ఉర్దూ అక్షరంభీ రావ్‌కదా! మూడు జన్మ కావాలి-"

అందరూ నిసార్‌కి సర్ది చెప్పారు.

"నా దగ్గర ఒక లిస్ట్ ఉన్నయ్- ఏ పార్టీ మనకు ఏం ఫుక్కట్‌గా ఇస్తయ్- మీదికెళ్ళి- ఎలక్షన్ ముందటి దినం రాత్రి మన ఇళ్ళకొచ్చి ఎన్ని పైసల్ ఎక్స్‌ట్రా ఇస్తయ్- ఇదంతా ఈ లిస్ట్‌లో ఉన్నయ్. ఇప్పుడు ఈ లిస్ట్ రంగారెడ్డి చదువుతయ్-" అంటూ రంగారెడ్డికి నిసార్ లిస్ట్ ఇచ్చాడు.

రంగారెడ్డి వెంటనే చదవటం మొదలుపెట్టాడు.

"నిలుపు దోపిడీ పీపుల్స్ పార్టీ వాళ్ళు ఇచ్చిన హామీలు- రాష్ట్రంలోని వైట్‌కార్డ్

స్త్రీలందరికి జరీ చీరలు ఒక్కొక్కరికి ఆరు చొప్పున ఉచితం! ఒక్కో చీర ఖరీదు కనీసం మూడు వేలుంటుంది!"

కాలనీలో ఉన్న వైట్‌కార్డ్ వాళ్ళు తప్పట్లు కొట్టారు.

"నిలుపు దోపిడీ పీపుల్ పార్టీ– జిందాబాద్" అంటూ అరిచారు.

"అది కాకుండా– వైట్‌కార్డ్ కుటుంబాలన్నిటికీ నెలకు వందకిలోల బియ్యం ఉచితం–"

మళ్ళీ తప్పట్లు కొట్టారు వైట్‌కార్డ్ వాళ్ళు.

"అది కూడా కాకుండా– వైట్‌కార్డ్ వాళ్ళందరికి– ప్రతి ఇంటికీ నాలుగు వైట్‌కార్డ్‌లు ఉచితం–"

తప్పట్లు ఇంకా పెద్ద ఎత్తున మారుమ్రోగిపోయినయ్.

"ఇక అష్టదరిద్ర ప్రజాస్వామ్య పార్టీవాళ్ళు ఇస్తున్న ఎన్నికల మానిఫెస్టో ఏంటంటే తెలుగు ప్రజలందరికీ– వైట్‌కార్డ్‌తో పని లేకుండా– నెలకు ముప్ఫై లీటర్ల బ్రాందీ, లేక విస్కీ, లేక రమ్ము ఉచితం–"

ఈసారి మొత్తం అక్కడున్న వారంతా, పదేళ్ళ విద్యార్థులతో సహా తప్పట్ల వర్షం కురిపించారు. యూత్ అసోసియేషన్ వాళ్ళు డాన్స్‌లు కూడా చేశారు– గాళ్ స్టూడెంట్స్‌తో కలసి.

"హాట్‌డ్రింక్స్ తీసుకోని వారికి వెయ్యి లీటర్ల బీరు కూడా ఉచితంగా ఇవ్వాలె! అప్పుడే ఆ పార్టీకి మా ఓట్లు" అంటూ అరిచారు అమ్మాయిలు.

"అష్టదరిద్ర ప్రజాస్వామ్య పార్టీ– జిందాబాద్– పది కాలాలు వర్ధిల్లాలి–" అని కూడా నినాదాలు చేశారు.

"అది కాకుండా– ఇదే పార్టీ ఇంకో అద్భుతమయిన వాగ్దానం కూడా చేస్తోంది–" అన్నాడు శాయిరామ్.

"అదేంటో చెప్పు– చిల్లర సస్పెన్సూ నువ్వూనూ–" వెనుక నుంచి స్టూడెంట్స్ అరిచారు.

"వైట్‌కార్డ్ ఉన్న ప్రతి కుటుంబానికి టాటావారి 'నానో' కారు ఉచితం–"

అంతా ఈలలూ, తప్పట్లూ–

"ఇక వీరపీకుడు పార్టీవాళ్ళ వాగ్దానాలేంటంటే బలహీన, బడుగు, మైనారిటీ, వెనుకబడిన వర్గాల వారందరికీ మెట్రోరైల్లో ఉచిత ప్రయాణం, ఆర్టీసీలో రాష్ట్రంలో ఏ మూల నుంచీ ఏ మూలకయినా ఉచితం ప్రయాణం, విమానాల్లో సంవత్సరానికి రెండు సార్లు ప్రపంచంలో ఏ దేశానికైనా ఉచిత ప్రయాణం! ఆకాశశ్రీ అనే ఈ పథకంలో ఫోన్ 1001 కొట్టగానే ఏసీ వాన్ వచ్చి అందర్నీ ఎయిర్‌పోర్ట్‌కి తీసుకెళ్తుంది."

తప్పట్ల మోత మోగిపోయిందీసారి.

"వీరపీకుడు పార్టీయే– గెలవాలి– మాక్కావాలి! మన ఓట్లన్నీ వీరపీకుడు పార్టీకే–" లాంటి నినాదాలు హోరెక్కిపోయాయ్.

తరువాత పరమ నికృష్ట పార్టీ మానిఫెస్టో చదివాడు రంగారెడ్డి.

"కార్మికులందరూ వారానికొక్కరోజే– అంటే సోమవారాలు మాత్రమే పనిచేయాలి– మిగతా ఆర్రోజులూ ఎంజాయ్! అంతేకాదు– వారందరికీ సంవత్సరానికి పది లక్షల రూపాయలు బోనస్ ఇస్తాం! ఆ కంపెనీలు, ఆఫీస్‌లు ఎంత నష్టాల్లో ఉన్నా సరే– ఒకవేళ కంపెనీ దివాలా తీస్తే ఇన్సూరెన్స్ కంపెనీలు ఆ పదిలక్షలూ చెల్లిస్తాయ్. రైతులకు పొలం ఉన్నా లేకపోయినా వ్యవసాయం చేసినా, చేయకపోయినా నెలకు లక్షరూపాయలు బ్యాంక్ రుణం ఫ్రీ– అది కూడా వాపస్ ఇవ్వక్కర్లేదు–"

అంతా తప్పట్లు మార్మోగిపోయాయ్‌గానీ ముందు వరుసలో కూర్చున్న కార్మికుడు లేచి నిలబడ్డాడు కోపంగా.

"వారానికొక్కరోజు అంటే– సోమవారం మాత్రమే పని చేయాలన్నారు బాగానే వుంది సార్– కానీ ప్రతి సోమవారం అలా పనిచేస్తూనే ఉండాలా? ఇక మాకు వీక్లీ ఆఫ్ ఎప్పుడిస్తారు సార్? సంవత్సరానికి ఎన్ని రోజులు శెలవులుంటాయ్? సిక్‌లీవ్ ఎన్ని నెలలుంటుంది? ప్రసూతి శెలవులు సంగతేంటి?"

"ఆ విషయంపై పార్టీ మానిఫెస్టోలో వివరాలు లేవు– కనుక్కొని చెప్తాం–" అన్నాడు శాయిరామ్.

ఆ వర్కర్ గొణుక్కుంటూ కూర్చున్నాడు

"భూర్జువా నా కొడుకులు–"

"అంతేకాదు! మా పార్టీ అధికారంలో కొస్తే మైనారిటీలయిన ముస్లిమ్ సోదరులకు రంజాన్ మాసమంతా ఉచితంగా బిరియానీ, హలీమ్ పాకెట్లు ఇస్తాం!"

ముస్లిం సోదరులు తప్పట్లు కొట్టారు.

"తరువాత చిల్లర పార్టీ వాళ్ళ మానిఫెస్టో! ఈ పార్టీ అధికారంలో కొస్తే మద్యం రాష్ట్రమంతా ఏరులయి ప్రవహిస్తుంది– అదీ ఉచితంగా. ప్రతి ఇంటికి మద్యం కుళాయిలు ఏర్పాటు చేస్తాం– కుళాయిలు తిప్పుకుని ఎవరికెంత కావాలో అంత 24 గంటలూ తాగి పడివుండవచ్చు– అంతేకాదు. వ్యభిచారానికీ పెద్దపీట వేస్తాం! లీగలైజ్ చేస్తాం. గల్లీగల్లీకీ వ్యభిచార గృహం– ఆ వ్యభిచారులందరికీ కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఉచిత పరీక్షలు, వైద్యం– అంతేకాదు– ఉచిత మందులు కూడా– ఫోన్ కొడితే చాలు– ఈ స్కీమ్ పేరు సెక్స్‌శ్రీ పథకం–

జీరో నెంబర్ డయల్ చేయగానే సెక్స్‌శ్రీ కారు మీ ఇంటికొస్తుంది. మిమ్మల్ని తీసుకెళ్ళి సమీపంలో ఉన్న వ్యభిచార గృహానికి చేరుస్తుంది. అక్కడ మీక్కావలసిన అమ్మాయిని మీరు సెలక్ట్ చేసుకుని ప్రభుత్వ అతిథి గృహాలు బుక్‌చేసుకుని అందులో మీకిష్టమొచ్చినన్ని రోజులు ఉండవచ్చు–"

స్టూడెంట్స్ ఈలలూ తప్పట్లతో మోతెక్కించేశారు.

"చిల్లర పార్టీయే కావాలి"

"చిల్లర పార్టీ – జిందాబాద్–"

"సాటిలేని మేటి పార్టీ– చిల్లర పార్టీ"

"ఇవీ మనకున్న పార్టీలు! కనుక వీటిల్లో ఏ పార్టీని గెలిపిస్తే మనకు లాభాల పంట కలుగుతుందో డిస్కస్ చేసుకుని డిసైడ్ చేయాల్సి ఉంది" అంటూ ముగించాడు రంగారెడ్డి.

రాత్రి పన్నెండింటివరకూ తీవ్రమయిన చర్చలు జరిగాయ్. ఒక్కో ఏజ్ గ్రూప్ వాళ్ళూ ఒక్కో పార్టీని సపోర్ట్ చేయడంతో ఏకాభిప్రాయం కుదర్లేదు. వాతావరణం చాలా వేడెక్కిపోయాక జనార్ధన్ కల్పించుకున్నాడు.

"సోదర సోదరీమణులారా! మీరు నిర్ణయం తీసుకునే ముందు రెండు మాటలు మాట్లాడాలనిపించింది. ఇన్ని పార్టీలు ఎన్నికల మానిఫెస్టోని ప్రకటించాయ్‌గానీ– వీటిల్లో ఏ ఒక్కరూ వాళ్ళ ఎన్నికల వాగ్దానాలకు నిధులు ఎలా సమకూర్చుకుంటారో తెలుపలేకపోతున్నారు. ఓటు వేసేముందు మనం ఆ పాయింట్ క్లారిఫై చేయమని చెప్పాలి" అన్నాడతను. అప్పుడే అతని సెల్‌ఫోన్ మోగింది.

"సోదరులారా! ఇప్పుడే నిలువుదోపిడీ పార్టీవాళ్ళు మాట్లాడారు. వాళ్ళు మన రాష్ట్రంలో మూడోవంతు భూమిని విదేశాలకు అమ్మి ఆ డబ్బుతో ఎన్నికల వాగ్దానాలు అమలు చేస్తారట– ఇక అష్టదరిద్ర ప్రజాస్వామ్య పార్టీవాళ్ళయితే రైతులందరినీ పక్క రాష్ట్రాలకు వలస పంపి వాళ్ళ భూములన్నీ సెజ్‌లకు ఇచ్చి ఆ డబ్బుతో వాగ్దానాలు అమలు పరుస్తారంట– ఇక వీరపీకుడు పార్టీవాళ్ళు అరబ్‌దేశాలకు మన రాష్ట్రంలోని లేబర్‌ని అమ్మేసి ఆ డబ్బుతో వాగ్దానాలు అమలు పరుస్తారంట. ఇక పరమనికృష్ట పార్టీ వాళ్ళు మన రాష్ట్రాన్ని థాయ్‌లాండ్‌లాగా సెక్స్ కాపిటల్‌గా చేసి విదేశీ యాత్రికుల ద్వారా వచ్చే ఆదాయంతో వాగ్దానాలు అమలు పరుస్తారంట!

చిల్లర పార్టీవాళ్ళేమో టెర్రరిస్ట్‌లతో లింకులు పెట్టుకుని వాళ్ళకు స్థావరాలు ఇచ్చినందుకు డబ్బు సంపాదిస్తారట–"

అందరూ రాత్రి రెండింటి దాకా ఆలోచించి చివరకు కంబైన్డ్‌గా నిర్ణయం తీసుకున్నారు.




"మా నిర్భయ్‌నగర్‌కాలనీ కే లోగ్– టూమచ్‌గా విచారణ చేసి ఒక అండర్‌స్టాండింగ్‌కి వచ్చినయ్. ఆ నిర్ణయం ఏమున్నయ్ అంటే పార్టీలు ఇచ్చిన ప్రామిస్‌లు అన్నీ మంచిగున్నయ్. ఆ ప్రామిస్‌లు అమలు చేస్తే– మన స్టేట్‌లో ఒక్క జనంభీ కొలువు చేసే పనిలేవ్! మొత్తం జనం అన్నింటికీ ఫ్రీగా మద్యం వస్తయ్. పుక్కట్‌గా బియ్యం వస్తయ్ ఫారిన్ టూర్స్ పుక్కట్! మెట్రోరైల్ పుక్కట్– బస్ జర్నీ పుక్కట్! వ్యభిచారం పెద్ద ఇండస్ట్రీ అవుతయ్! లేబర్ నెలకు ఒక్కటే దినం కొలువు జేస్తయ్– రైతులు వ్యవసాయం చేయకపోయినా పుక్కట్‌గా బాంక్‌లోన్– అదిభీ హర్ ఏక్ కో దస్ లాక్– ఆ లోన్ వాపస్ చేసే పనిలేవ్– అందుగురించి మనం ఏదో ఒక్కపార్టీకి ఓటింగ్ చేస్తే బాకీ పార్టీలు ఇచ్చే లాభం పోతయ్. దాన్దిక్కు వెళ్ళి ఏ పార్టీకి మెజారిటీ రాకుండా ఓటింగ్ చేయాలే– వైసా కరేతో– కొయ్‌లేషన్ గవర్నమెంట్ ఏర్పడతయ్–

అప్పుడు అన్ని పార్టీలు వాగ్దానాలు ఇంప్లిమెంట్ చేస్తయ్. మనకి బహుత్ ఫాయిదా అవుతయ్–" అందరూ తప్పట్లు కొట్టి నిసార్‌ని అభినందించారు.

"ఈ పార్టీల వాగ్దానం వల్ల మనందరికీ లాభాలే గాని కొద్ది రోజులు తరువాత మన రాష్ట్రం గతేంటి?" రంగారెడ్డి అడిగాడు. చాలాసేపు ఎవరూ మాట్లాడలేదు గానీ ఆఖర్లో అరిచారు.

"అరె రంగారెడ్డీ! ఫ్యూచర్ గురించి నీకెందుకురా! ఇప్పుడెంజాయ్ చెయ్"

* * * * *